క్లుప్తంగా

ఘనంగా పేపర్ బోయ్ దినోత్సవం



కరప లైబ్రరీలో పేపర్ బాయ్‌లను సత్కరిస్తున్న మాజీ సర్పంచ్, ఈఓ

కరప: పేపర్‌బాయ్ దినోత్సవాన్ని బుధవారం స్థానిక ఉప గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు మాట్లాడుతూ పత్రికలను పాఠకులకు చేరవేయడంలో పేపర్‌బోయ్‌లే కీలక పాత్ర పోషిస్తారన్నారు. 30 ఏళ్లుగా వాసంశెట్టి వెంకటరమణ, 15 ఏళ్లుగా పితాని శ్రీనివాస్ పేపర్ బాయ్‌లుగా సేవలందిస్తున్నందుకు గుర్తింపుగా దేవదాయ శాఖ ఈఓ మోర్త మురళీవీరభద్రరావు, రికార్డు అసిస్టెంట్ ఎన్వీఎస్ ఫణీంద్రకుమార్‌తో కలిసి మాజీ సర్పంచ్ తాతీలు వారిని సత్కరించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

కాకినాడ రూరల్: రాష్ట్ర నాయకత్వం ఆదేశాలతో బీజేపీ సభ్యత్వాలను నమోదు చేస్తున్నట్టు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక రమణయ్యపేట వైద్య నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి విలేకర్లతో మాట్లాడుతూ, సభ్యత్వ నమోదు వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామకుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన



నేత్రదానంపై వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న సభ్యులు

బాలాజీచెరువు: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా పీఆర్ డిగ్రీ కళాశాల వాకర్స్‌కు బుధవారం అవగాహన కల్పించారు. బాదం బాలకృష్ణ ఐ–బ్యాంక్ ట్రస్టీ చంద్రశేఖర్ మాట్లాడుతూ, అన్ని వయస్సుల వారు నేత్రదానం చేయవచ్చని చెప్పారు. కేవలం కంటి పైపొర మాత్రమే తీస్తారన్నారు. నేత్రదానంపై ఇప్పటికీ అవగాహన లేక చాలామంది ముందుకు రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. దీనిపై అవగాహన పెంచుకుని బంధువులు, స్నేహితులకు తెలియజేయాలని సూచించారు. అనంతరం కరపత్రాలు అందజేసి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐ–బ్యాంక్ సిబ్బంది నాని, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

మరణ శయ్య

- కాకినాడ జీజీహెచ్‌లో ఎంఆర్‌డీ పరిస్థితి అధ్వానం
- శిథిలావస్థలో జనన, మరణాల నమోదు విభాగం
- భవనాన్ని కూల్చేయాలంటూ ఇప్పటికే ఇంజినీర్ల ధ్రువీకరణ
- అయినా కొనసాగిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం
- తాత్కాలిక భద్రతా చర్యల ఊసైనా ఎత్తని అధికార యంత్రాంగం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో మెడికల్ రికార్డ్స్ సెక్షన్(ఎంఆర్‌డీ) మరణ వేదనను అనుభవిస్తోంది. ఎందరివో జనన, మరణాలను నిర్ధారించి.. తన మరణానికి మాత్రం తానే ధ్రువపత్రాన్ని లిఖించుకుంటోంది. శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడే లేడు. కూల్చేయాలంటూ ఇంజినీర్లే చెప్పినా ఆ దిశగా చర్యలు, చర్చలేవీ లేవు. కోవిడ్ సమయంలో ట్రైనీ కలెక్టర్‌గా కొనసాగిన ప్రవీణ్ చంద్ చొరవతో తాత్కాలిక ఉపశమనం లభించినా, నిర్వహణ లేక మళ్లీ కథ మొదటికే వచ్చింది. ఈ నిర్లక్ష్యం కాస్తా సామాన్య జనంతో పాటు, సిబ్బందికి ప్రాణ సంకటంగా పరిణమిస్తోంది.

విశేష సేవలందిస్తూ..

జీజీహెచ్‌లోని ఎంఆర్‌డీ సెక్షన్ 1952లో 72 ఏళ్ల క్రితం నిర్మితమైంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే కాదు, ప్రస్తుత విభజిత జిల్లాల ప్రజలకు విశేష సేవలందిస్తోంది. బర్త్, డెత్ సర్టిఫికెట్ల నుంచి ఇన్సూ్యరెన్స్ నిర్ధారణ, ఎంఎల్‌సీ కేసుల్లో కోర్టు కోరే కీలక పత్రాలన్నీ మంజూరయ్యేది ఇక్కడే. ఎంఆర్‌డీ చెబితేనే పుట్టినట్టు, ఎంఆర్‌డీ చెబితేనే మరణించినట్టు, అంతటి ప్రాధాన్యమున్న విభాగమిది.

ఇదీ దుస్థితి..

ఆస్పత్రి ప్రధాన భవంతిలో సూపరింటెండెంట్ ఛాంబర్ ఉండగా, అదే భవంతిలోని రెండో అంతస్తులో ఎంఆర్‌డీ సెక్షన్ ఉంది. ఈ విభాగం దుస్థితి వర్ణనాతీతం. కొత్తగా నిర్మించిన సెక్షన్ ఏసీలు, అద్దాలతో తళతళలాడుతున్నా, పైన పటారం లోన లొటారం చందాన్ని తలపిస్తోంది. చిన్నపాటి వర్షం వచ్చినా ఇందులో ఫ్లోర్ మొత్తం వరద మయమవుతోంది. ప్రజలు వేచి ఉండే ప్రదేశాల్లో నెత్తినే ముప్పు కాచుకొని ఉంది. శ్లాబ్ పెచ్చులూడి పడిన ఘటనల్లో గాయాలపాలైన వారెందరో ఉన్నారు. ఎంఆర్‌డీ సెక్షన్ ఫ్లోర్‌లో ఏర్పడ్డ ఓ భారీ చీలిక అత్యంత ప్రమాదకర స్థితిలో ఆందోళనకరంగా ఉంది. నేరుగా గ్రౌండ్ ఫ్లోర్ కనిపిస్తున్న ఆ రంధ్రం వద్దకు చిన్నపిల్లలు వెళితే, వారి కాళ్లు ఇరుక్కుపోవడం ఖాయం. ఇది ఆస్పత్రి అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.

కొత్త నిర్మాణం జలమయమే..

శిథిలావస్థలో ఉన్న ఎంఆర్‌డీలో కొంత భాగానికైనా విముక్తి కల్పించాలని చూపిన చొరవ నీళ్లపాలైంది. అంతకు ముందు ఎంఆర్‌డీ సెక్షన్లో ఆరు గదులుండేవి. ఎంఆర్‌వో, ఎస్‌వోలకు ఒక గది కార్యాలయంగా ఉండేది. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు రెండో గది, రిసీవింగ్ సెక్షన్‌గా మూడో గది ఉండేది. ఇందులో ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ రికార్డులకు ప్రత్యేక విభాగాలుండేవి. నాలుగో గదిలో బర్త్ అండ్ డెత్ రికార్డులు, ఐదు, ఆరు గదుల్లో తాజా రికార్డులను భద్రపరిచేవారు. కొన్నాళ్ల క్రితం కొత్తగా మరమ్మతులు చేపట్టిన విభాగంలోకి ఎంఆర్‌వో, ఎస్‌వో సహా, స్టాటిస్టికల్, జనన, మరణ నమోదుల సెక్షన్లను మార్చారు. సీనియర్ అసిస్టెంట్లకు చెందిన పత్రాల పరిశీలన విభాగాలు ఇప్పటికీ ఆ శిథిల గదుల్లోనే కొనసాగుతున్నాయి. అదనంగా ఓపీఎస్ఎస్‌ఆర్‌లో మూడు గదులు ఇవ్వగా, ఇవి కూడా రికార్డులతో నిండిపోయాయి. నిర్మాణ సమయంలో చిన్న లోపంతో కొత్త విభాగం వర్షాల వేళ ఎందుకూ పనికి రాకుండా పోతోంది. పాత శ్లాబ్‌ను మరమ్మతులు చేసి, పాత, కొత్త శ్లాబ్‌ల జాయింట్ సరిచేయకపోవడం మొత్తం నిర్మాణాన్నే నిరుపయోగంగా మార్చింది. వర్షం నీళ్లన్నీ నేరుగా సెక్షన్లోకి దిగి వరద మయం అవుతోంది.





దరఖాస్తుదారులు సంచరించే కారిడార్‌లో శిథిల సీలింగ్

ఎంఆర్‌డీ ఫ్లోర్ ధ్వంసమై ఏర్పడిన భారీ రంధ్రం

అధ్వానంగా రికార్డ్ స్టోరేజ్ రూం

100 మందికి పైగా..

నిత్యం కాకినాడ జీజీహెచ్‌లోని ఎంఆర్‌డీ సెక్షన్‌కు 100 మందికి పైగా వస్తారు. మరణ, జనన పత్రాలు పొందేవారే వీరిలో ఎక్కువ మంది కాగా, కోర్టు ఆదేశాల మేరకు ఇవ్వాల్సిన రికార్డుల కోసం, ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ పత్రాల కోసం, సర్టిఫికెట్లలో తప్పొప్పుల సవరణలు, ఆర్‌టీఏ దరఖాస్తుల రికార్డులకు ఈ సెక్షన్‌ను సందర్శిస్తారు. నిత్యం 15 మంది ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ సెక్షన్‌లో రోజుకు కనీసం 30 జనన, 25 మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తారు.

ఇంజినీర్లే కూల్చేయమన్నా..

భవనం పరిస్థితిని చూసిన ఇంజినీర్లు మరమ్మతుల వల్ల ప్రయోజనం లేదని, అత్యంత ప్రమాద స్థితిలో ఉందని నిర్ధారించి, తక్షణమే భవనాన్ని కూల్చేయాలని సూచించారు. ఇప్పటికీ వారి సూచనకు ఎటువంటి స్పందన లేదు. ప్రజలు, ఉద్యోగుల ప్రాణాలతో అధికారులు చెలగాటమాడుతున్నారన్న విమర్శలున్నాయి.





బీరువాలు లేకపోవడంతో పాడైపోతున్న కీలక రికార్డులు

కుప్పలుగా కీలక రికార్డులు

ఎండకు ఎండుతూ, వానకు నానుతూ కీలక రికార్డులన్నీ ఎంఆర్‌డీ సెక్షన్‌లో కుప్పలుగా పడిఉండడం విస్మయానికి గురిచేస్తోంది. జనన, మరణ పత్రాలను అత్యంత భద్రంగా సంరక్షించాల్సి ఉండగా, కనీసం బీరువాలు కూడా అందుబాటులో లేవు. వర్షపు నీటితో కొన్ని రికార్డులు పాడవ్వగా, మరి కొన్ని చెదలు పట్టాయి.

తాత్కాలిక చర్యలూ శూన్యం

ఎంఆర్‌డీకి వచ్చే ప్రజలు, కీలక రికార్డుల భద్రత కోసం తాత్కాలిక చర్యలైనా అధికారులు చేపట్టడం లేదు. టార్పాలిన్ కప్పే అవకాశం ఉన్నా విస్మరిస్తున్నారు. బుధవారం జీజీహెచ్‌కి వచ్చిన కలెక్టర్ కీలక పత్రాలు సంరక్షించే ఎంఆర్‌డీ సెక్షన్‌లో వరద నీరుని పట్టేందుకు బకెట్లు ఏర్పాటు చేయడాన్ని చూసి కంగుతిన్నారు. తాత్కాలిక చర్యలైనా చేపట్టండని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకు మొద్దు నిద్రలో ఉన్న అధికారులు తీరును కలెక్టర్ తప్పుబట్టారు.

ఆర్‌ఓ ప్లాంట్లు ప్రారంభించిన కలెక్టర్



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, చిత్రంలో డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో కోస్టల్ ఆక్వా సంస్థ సౌజన్యంతో నిర్మితమైన నాలుగు శుద్ధి జల కేంద్రాలను కలెక్టర్ షణ్మోహన్ బుధవారం ప్రారంభించారు. అనంతరం ఈఎన్‌టీలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఆడియో మీటర్ సేవలను కలెక్టర్ ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులు మంచినీటి కొరత పూర్తి స్థాయిలో తీరనుందన్నారు. కోస్టల్ ఆక్వా యాజమాన్యానికి, ఇందుకు కృషి చేసిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారిని అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధికారులు, కోస్టల్ ఆక్వా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కాకినాడ క్రైం: లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్, నారాయణ ఈ–టెక్నో అండ్ ఒలంపియాడ్ స్కూల్ సంయుక్తాధ్వర్యంలో స్థానిక రామారావుపేటలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ ఆస్పత్రి వైద్య బృందం ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సుమారు 300 మంది పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ పూర్వ ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయరామరాజు జన్మదినం సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 316బి గవర్నర్ ఈవీవీ.ఈశ్వర్‌కుమార్, డీసీఎస్ ఆదినారాయణ, ఆర్‌సీ పద్మతులసి, జెడ్‌సీ నమశ్శివాయ తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో కరప అధికారులు



విజయవాడలో వరద బాధితులకు ఆహార పొట్లాలను అందిస్తున్న తహసీల్దార్, ఆర్ఐ తదితరులు

కరప: విజయవాడ వరదల నేపథ్యంలో అక్కడి బాధితులకు కరప మండల రెవెన్యూ అధికారులు మూడు రోజులుగా సహాయక చర్యలు అందించడంలో నిమగ్నమయ్యారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశాల మేరకు కరప తహసీల్దార్ పిండి వెంకటగోపాలకృష్ణ, ఆర్ఐ పేపకాయల మాచర్రావు, వీఆర్వోలు టి.సత్యనారాయణరెడ్డి, ఎం.నాగరాజు, సాయి తదితరులు విజయవాడలోని సింగ్‌నగర్, వాంబే కాలనీ, ప్రకాష్‌నగర్, శాంతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. అక్కడి వరద బాధితులకు అవసరమైన సహాయక చర్యలు చేస్తున్నారు. పోలీసులు, అక్కడి సచివాలయ సిబ్బందితో కలిసి బాధితుల గృహాలకు, వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి ఆహార పొట్లాలు, పాలు, బిస్కెట్లు అందిస్తున్నట్టు తహసీల్దార్ వెంకటగోపాలకృష్ణ తెలిపారు.

పన్నుల వసూళ్లపై దృష్టి

డిప్యూటీ కమిషనర్ మనోహర్



బాధ్యతలు స్వీకరిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎస్.మనోహర్

కాకినాడ: నగరాభివృద్ధికి కీలకమైన ఆస్తి, కుళాయి, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ ఎస్.మనోహర్ అన్నారు. అమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత అర్ధ వార్షిక బకాయిలతో పాటు, మొండి బకాయిలు కూడా వసూళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశాలకు అనుగుణంగా పన్నులపై దృష్టి పెట్టి, నగరాభివృద్ధిలో కీలకమైన పన్నులు సకాలంలో వచ్చేలా కృషి చేస్తానన్నారు.

హిందువులు ఐక్యంగా ఉండాలి

- వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తనికెళ్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్య రవికుమార్

బోట్‌క్లబ్: ఐక్యంగా ఉంటే హిందువులు ఏదైనా సాధించవచ్చని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు తనికెళ్ల సత్య రవికుమార్ అన్నారు. స్థానిక విద్యుత్ నగర్‌లోని చల్లా ఫంక్షన్ హాల్‌లో బుధవారం వీహెచ్‌పీ హిందూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, అయోధ్యలో భవ్య రామమందిరాన్ని నిర్మించుకోగలిగామన్నారు. హిందువుల ఆచారాలను, కట్టుబాట్లను కొందరు హేళన చేస్తున్నారన్నారు. రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ, వీహెచ్‌పీ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తొలుత భజనలు, చిన్నారుల శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, మహిళల కోలాటాలు, నృత్యాలు, భక్తి పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సంస్థ సీనియర్ నాయకుడు మద్దాల శ్రీరామచంద్రమూర్తి, గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ పాల్గొన్నారు.

కోడి పందేలాడుతున్న పది మంది అరెస్టు

జగ్గంపేట: మండలంలోని మామిడాడ పరిసర ప్రాంతాల్లో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై జగ్గంపేట పోలీసులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడుల్లో పది మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.78 వేలు స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై రఘునాథరావు తెలిపారు. మండలంలోని మామిడాడ, నరేంద్రపట్నం గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పది మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులతో పాటు, రూ.78 వేలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వివరించారు.

తాగి వాహనం నడిపిన వారికి జరిమానాలు

పిఠాపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి బుధవారం కోర్టు జరిమానాలు విధించినట్టు పిఠాపురం రూరల్ పోలీసులు తెలిపారు. వాహన తనిఖీల్లో భాగంగా పోలీసులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 9 మందిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు. వారికి పిఠాపురం అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.వెంకటఅపర్ణ ఒకొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానాలు విధించినట్టు పోలీసులు తెలిపారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక



వాకాడ వెంకటరమణ | బి.పద్మావతి | కేవీ రామకృష్ణ | వై.సువర్చలాదేవి | చీపురపల్లి కృష్ణ | ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ

కరప: మండలం నుంచి ప్రైమరీ విభాగంలో ఇద్దరు, హైస్కూల్ విభాగంలో ఇద్దరు పీడీలు, గురుకుల పాఠశాలలో ఒకరు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రైమరీ విభాగంలో నడకుదురు ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ వాకాడ వెంకటరమణ, యండమూరు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన బి.పద్మావతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అలాగే కరపలోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయం(బాలురు) ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణారావు, గొర్రిపూడి జెడ్పీ హైస్కూల్ పీడీ వై.సువర్చలాదేవి, కరప నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ హైస్కూల్ పీడీ చీపురుపల్లి కృష్ణ ఈ ఏడాది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

కాకినాడ రూరల్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా పండూరు జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్ ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ ఎంపికయ్యారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీగా సేవలందిస్తున్నారు.

అంగన్‌వాడీల్లో సొంత బిడ్డల్లా చూడాలి

- డీఆర్వో డి.తిప్పే నాయక్



జ్యోతి వెలిగించి మాసోత్సవాలను ప్రారంభిస్తున్న డీఆర్వో తిప్పే నాయక్


బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరినీ తమ సొంత బిడ్డలుగా చూసుకోవాలని డీఆర్వో డి.తిప్పే నాయక్ అన్నారు. ఏదో మొక్కుబడిగా కాకుండా, మనస్ఫూర్తిగా విధులు నిర్వహించాలని సూచించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోషకాహార మాసోత్సవాలకు ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ మాట్లాడుతూ, సెప్టెంబర్ నెలను పౌష్టికాహార మాసోత్సవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తల్లి గర్భం దాల్చిన తొలి రోజు నుంచి బిడ్డకు రెండేళ్లు నిండే వరకు పౌష్టికాహారం అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరికీ పౌష్టికాహారం నుంచే సరైన పోషణ అనే నినాదంతో పలు కార్యక్రమాలను వివిధ శాఖల సమన్వయంతో ప్రతి గ్రామంలోను, వార్డుల్లోను నిర్వహిస్తున్నామని వివరించారు.

పురాతన భవనాల్లో ఉండొద్దు

తహసీల్దార్ కొవ్వూరి హెచ్చరిక

సామర్లకోట: శిథిల స్థితికి చేరిన, పురాతన భవనాల్లో నివాసం ఉండవద్దని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి హెచ్చరించారు. స్థానిక కరప చెరువు వద్ద లక్కల ప్రకాశరావుకు చెందిన మట్టి ఇల్లు కూలిపోవడంతో, బుధవారం సాయంత్రం దానిని ఆయన పరిశీలించారు. గత పది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురవడంతో మట్టి గోడలు కూలిపోయే అవకాశం ఉందన్నారు. అటువంటి ఇళ్లలో నివాసం వద్దని సూచించారు. బాధితుడు ప్రకాశరావు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామన్నారు. బాధితులకు ప్రభుత్వ పథకంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తహసీల్దార్‌కు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్,. కురుకూరి సోమేశ్వరరావు, శెట్టిబత్తుల దుర్గారావు విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకుంటున్న హస్తకళా ప్రదర్శన



ప్రదర్శనలో కొనుగోళ్లు చేస్తున్న సందర్శకులు

బోట్‌క్లబ్: సృజనాత్మకతతో కళాకారులు రూపొందించిన కళాత్మక వస్తువులు కొనుగోలు చేసి, చేనేత వస్త్రాలు, హస్తకళలను ప్రోత్సహించాలని హస్తకళా మేనేజర్ నసీమ్ అన్నారు. స్థానిక జేఎన్‌టీయూకే ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో కళాకారులు తయారు చేసిన కలంకారీ, బెంగాల్ కాటన్ చీరలు, కలంకారీ వస్త్రాలు, బ్యాంగిల్స్, కలంకారి డ్రెస్ మెటీరియల్స్, ఖాదీ చొక్కాలు, జైపూర్ బెడ్ షీట్లు, పానిపట్ సోఫా కవర్లు, మైసూర్ పెయింటింగ్స్, టెరికోటా ఐటమ్స్, నాగాలాండ్ డ్రై ఫ్లవర్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూయలరీ, ఢిల్లీ రెడీమేడ్ గార్మెంట్స్, లేడీస్ చెప్పల్స్, సహరన్పూర్ ఫర్నిచర్, లేడీస్ టాప్స్, హైదరాబాద్ పెరల్స్, ఫిరోజాబాద్ గ్లాస్ గిఫ్ట్ ఐటమ్స్ లభిస్తాయని వివరించారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

దేశభక్తిని రగిల్చిన ఆర్మీ

- కార్గిల్ యుద్ధ వీరుడు కెప్టెన్ బోగిళ్ల జగదీష్‌కుమార్
- ఉద్యోగ విరమణ సందర్భంగా పౌర సన్మానం

సామర్లకోట: ఆర్మీలో చేరడంతోనే దేశభక్తి పెరిగిందని ఆర్మీ కెప్టెన్ బోగిళ్ల జగదీష్‌కుమార్ అన్నారు. ఆర్మీలో 31 ఏళ్ల పాటు దేశానికి సుదీర్ఘ సేవలందించి, ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా బుధవారం రాత్రి స్థానిక రైతు భవనంలో ఆయనకు పౌర సన్మానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన స్నేహితుడితో పాటు ఆర్మీకి దరఖాస్తు చేసి, ఎంపికై సైన్యంలో చేరానని చెప్పారు. తన దరఖాస్తు పూర్తి చేసిన స్నేహితుడు శ్యామ్ ఎంపిక కాకపోవడం బాధ కలిగించిందన్నారు. సైనికునిగా దేశ సరిహద్దులో ప్రజలకు రక్షణగా నిలబడడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 1992లో బెంగళూరు వెళ్లే వరకు ఆర్మీ అంటే ఏమిటో తెలియదన్నారు. దేశ సరిహద్దు 15 వేల కిలోమీటర్లు, ఏడు వేల కిలోమీటర్ల కోస్టల్ ఐల్యాండ్‌లో లక్షలాది మంది సైనికులు సేవలందిస్తున్నారని వివరించారు. సరహద్దు ప్రాంతాల్లో ఏడు దేశాలు ఉంటాయన్నారు. దేశం అంటే బాధ్యతగా పని చేయడం తెలుసుకున్నానని తెలిపారు. కులమతాలకు అతీతంగా పని చేయడంతోనే దేశ ప్రజలు సంతోషంగా ఉంటారని సీనియర్ల ద్వారా, అధికారుల ద్వారా తెలుసుకున్నట్టు చెప్పారు. భూకంపాలు, వరదలు వచ్చిన సమయాల్లో ఆర్మీ సేవలు అందిస్తుందన్నారు. తన తల్లిదండ్రులు, భార్య ప్రోత్సాహం ఎంతో ఉందని తెలిపారు.

'కోట'కు పేరు ప్రతిష్టలు

పట్టణానికి చెందిన బోగిళ్ల జగదీష్‌కుమార్ కార్గిల్ యుద్ధంలో పాల్గొని, దేశానికి సేవలందించడం ద్వారా సామర్లకోట పేరును దేశవ్యాప్తంగా చాటారని పలువురు వక్తలు కొనియాడారు. పౌర సన్మాన సభలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దేశానికి జగదీష్ కుమార్ చేసిన సేవలను కొనియాడారు. అతని తండ్రి మంచి కబడ్డీ క్రీడాకారుడు కావడంతోనే కుమారులకు కూడా ఏదో సాధించాలనే లక్ష్యం ఏర్పడిందన్నారు. పెద్ద కుమారుడు సైన్యంలో కెప్టెన్‌గా, రెండో కుమారుడు ఫిజికల్ డైరెక్టర్‌గా, ప్రో కబడ్డీ అంపైర్‌గా ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ మాజీ కోచ్ పోతుల సాయి, మాజీ మున్సిపల్ చైర్మన్ అలమండ చినఅప్పారావు, మాజీ వైస్ చైర్మన్లు గోలి దొరబాబు, గుణ్ణం రాజబ్బాయి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కొండపల్లి శ్రీనివాసు, తాళూరి వైకుంఠం, బొగిళ్ల మురళీకుమార్, కౌన్సిలర్ బలుసు వాసు, పారిశ్రామిక వేత్త పసల పద్మరాఘవరావు తదితరులు జగదీష్‌కుమార్ దంపతులను ఘనంగా సత్కరించారు.



కెప్టెన్ జగదీష్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు